# అంతరంగం

## ఎమ్.వి.వి.సత్యనారాయణ

అడల్ట్స్ ఓన్లీ కథ!

కథను సాపు ప్రతిరాసి ప్రక్కనే పెట్టింది రమ్య. బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ పనిలో పనిగా వేళ్లు విరుచుకుంది. రెండు గంటలనుండీ ఆగకుండా రాస్తూ చిత్తునించి సాపుప్రతిని తయారుచేసింది రమ్య.

''రాసిన వెంటనే నాకు ఫోన్ చెయ్యి! కొరియర్‌లో పంపించాలి స్క్రిప్ట్. దసరా కథల పోటీకి!'' అని చెప్పి మరీ వెళ్లాడు భర్త.

రమ్య నవ్వి, ''మీరు పాతికేళ్ల నించీ కథలు రాస్తున్నారు. ఇంక మీరు కథల పోటీలో పాల్గొనకూడదేమో!'' అంది.

విష్ణుమూర్తి ఆమె భుజం మీద చెయ్యి వేసి తనవైపు తిప్పుకుని చెక్కిలి మీద గోముగా వ్రేలితో రాస్తూ ''ఇది ప్రతిభకి పట్టం కట్టడమేకాని, అనుభవానిక్కాదు. కొత్తగా కథరాసిన వాడిక్కూడా మొదటి బహుమతి యివ్వొచ్చు. కథాగిధా బాగుంటే-'' అన్నాడు విష్ణుమూర్తి.

రమ్య చెయ్యి చాపి టెలిఫోన్ సెట్టును తన వైపు లాక్కుంది. విష్ణుమూర్తికి ఫోన్ చేసింది.

విష్ణుమూర్తి తన ఆఫీస్ అటెండర్‌ని పంపించి స్క్రిప్టును తన దగ్గరికి రప్పించుకున్నాడు. ఒకసారి సాపు ప్రతిని చదువుకుని తృప్తిపడి టైటిల్ రాసి దానికి కథ తన సొంతమేనని రాసిన హామీపత్రం జతపర్చి తిరిగి అదే అటెండర్ చేత కొరియర్ ఆఫీస్‌కి పంపించాడు.

మర్నాడు పత్రికా కార్యాలయానికి ఫోన్ చేశాడు విష్ణుమూర్తి.

సంపాదకుడే దొరికాడు ఫోన్‌లో.

''మీ కథ అందింది విష్ణు గారూ!'' అన్నాడు సంపాదకుడు అటునుండి.

''ఎలా వుంది?''

సంపాదకుడు తటపటాయించిన సూచనగా కొద్ది క్షణాల విరామం.

విష్ణుమూర్తిలో ఎస్.టి.డి. మీటర్ తిరుగుతోన్న ఆరాటం.

''మొదటి బహుమతిగా వుండవలసిన కథ కదా! ఇంకాస్త లోతు వుండాలి!'' అన్నాడు సంపాదకుడు.

విష్ణుమూర్తిలో పౌరుషం ఎగదన్నింది.

పాతికేళ్ల రచనానుభవమున్నవాడు ఇంకా నేర్చుకునేదేముంది?

''వేశ్య బ్రతుకును వూహించి రాశారు తప్ప వాస్తవంగా లేదు. అసలా పాత్ర త్రీడైమెన్షనల్‌గా వుండాలి!''

''అలాగేనండి! గడువుముగియవచ్చిందని-''

పసివాడ్ని చూసి నవ్వినట్టు అటు పక్కనించి ఎడిటర్ నవ్వు వినిపించింది.

''గడువు సూత్రం మనకి వర్తించదు. మీకింతకు ముందే ఈ సంగతి చెప్పాను కదా!''

''అవును సర్! మరోసారి రాసి పంపించమంటారా!''

''తప్పకుండానూ, లేకపోతే విమర్శలకు దొరికిపోమూ-''


రిసీవర్ క్రెడిల్ చేశాక పత్రికకి పంపిన కథను మరోసారి జ్ఞాపకం తెచ్చుకున్నాడు విష్ణుమూర్తి.

పాత్ర పోషణలో ఎక్కడా లోపం కనిపించడం లేదు. వేశ్యపాత్రను ఆదర్శవంతంగా మలచడం పొరపాటయ్యిందేమో! తామరాకు మీద నీటిబొట్టులాగా స్వచ్ఛంగా మెరుస్తుందేమో వేశ్య అని ఒక కొత్త సందేశం యివ్వడం పొరపాటేమో!

ఇంటికొచ్చాడన్న మాటేగానీ ఒకటే ఆలోచన అతడి బుర్రను తినేస్తోంది.

రమ్య అతడి పరాకుతత్వానికి కారణం అడిగింది.

''కథను తిరగరాయాలి!'' అన్నాడు విష్ణు



మూర్తి.

ఆమెకర్థం కాలేదు.

''మనం పెద్దాపురం వెళ్తున్నాం''

''ఎందుకు!''

''రాఘవను చూసి రావాలి!''

''రాఘవా! ఎవరతను?''

''అతను కాదు. ఆమె!''

''ఎవరామె! చెప్పొచ్చుకదా!''

నవ్వాడు విష్ణుమూర్తి ''చెబుతాన్లే! ఉదయాన్నే బయల్దేరదాం'' అన్నాడు.

మర్నాడు ఉదయాన్నే బస్సెక్కారు భార్యాభర్తలు.

''ఇప్పుడు చెప్పండి!'' అంది రమ్య.

''నా చిన్నప్పటి స్నేహితురాలు''

''ఏం చేస్తోందిప్పుడు?''

''రిటైరయ్యిపోయి వుంటుంది''

''అప్పుడే? మీ వయసు నలభై అయిదు. ఆవిడకీ అంతేకదా- ఒకటి రెండేళ్ల తేడా వుంటుందేమో!''

''అవును''

''మీ ధోరణి అర్థం కావడం లేదు ఆ వయసుకే రిటైర్మెంటేమిటి?''

''ఆడదాని ఒంట్లో జవసత్వాలు ఆ వయసు వరకే కదా వుంటాయి! అందులోనూ ఒళ్లు అమ్ముకునే దానికి?'' అతడి గొంతులో వ్యంగ్యం లేదు.

విష్ణుమూర్తి మాటలకు రమ్య దడుచుకుంది.

ఈ మానవుడు తనను తీసుకువెళ్లేది అలాంటి చెడిపోయినదాని దగ్గరికా!

ఆమె మొహంలో రంగులు మారుతున్నాయి. ఈమాత్రం సంగతి ఆయన యింట్లోనే తెలియపరచివుంటే అసలు తాను బయల్దేరి వుండేదే కాదు. ఎంత పొరపాటు జరిగిపోయింది. బస్సులోంచి దూకేద్దామన్నంత ఆత్రుత ఆమెలో చెలరేగింది. బలవంతంగా అణుచుకుంది. భర్త ఆంతర్యం ఆమెకేమాత్రం అర్థం కావడం లేదు. ఒక వేశ్య యింటికి తనను తీసుకు వెళ్లడమేమిటి?

ఆలోచించేకొద్దీ ఆమెకు పిచ్చెక్కేలాగా వుంది తప్ప బస్సు ఆగటం కానీ, తామిద్దరూ దిగిపోవడం కానీ లాంటి విచిత్రాలు జరగలేదు.

పిఠాపురం సమీపిస్తోండగా విష్ణుమూర్తి ''రాఘవతో నా పరిచయం గురించి మాట్లాడాలనిపిస్తోంది!'' అన్నాడు.

తలూపింది రమ్య.

భర్త మొహంలో ఆమెకి ఉత్సుకత కనిపించింది. తన అనుభవాలు పంచుకోవాలన్న తహతహ ద్యోతకమయింది.

''నేను మాట్లాడేదంతా నిజం!'' అన్నాడు విష్ణుమూర్తి ఉపోద్ఘాతంగా.

ఆమె మాట్లాడలేదు.

తన భర్త బాల్యావస్థ, యవ్వనం తొలిదశా ఆమె కళ్ల ముందు ఆవిష్కరింపబడ్తోంది.

అప్పట్లో విష్ణుమూర్తికి పదిహేడేళ్లు. ఎస్సెస్సెల్సీ గట్టెక్కిపోయాక పి.యు.సి. చదవలేక, పొరుగూర్లో వుంచి చదివించే స్తోమతా లేక టైప్ నేర్చుకున్నాడు. మిగతా సమయంలో లైబ్రరీకి వెళ్లి కూర్చోవడం, ట్యూషన్లు చెప్పుకుంటూ, తృణమో పణమో సంపాదించుకోవడం, కుటుంబానికి పెద్ద కొడుకుగా, ఆసరాగా నిలబడటం తప్పనిసరైన కార్యక్రమాలు.

ఉద్యోగం సంపాదించుకోవడానికి ఉత్తరదక్షిణాలూ, సాధనసంపత్తులూ అతడికి లేవు. తండ్రి ఒకప్పుడు బాగా బతికినవాడే కానీ, ప్రస్తుతం ఇంగువ కట్టిన గుడ్డే అయ్యాడు.

టైప్‌రైటింగ్ హయ్యర్ పాసయ్యాడు కాని విష్ణుమూర్తిని ఉద్యోగం ఏదీ కటాక్షించలేదు. ఏదో ఒక ఉద్యోగం. చివరికి ఎంత శంకరగిరి మన్యాలైనా సరే వెళ్లిపోవడానికతడు సిద్ధపడిపోయాడు. ఇంటర్వ్యూలకెళ్తున్నాడు. వస్తున్నాడు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌లో కొత్త సర్టిఫికెట్స్ జతపరుస్తోన్నాడు. తిరుగుతున్నాడు. తిప్పుతున్నారు.

అతడికి ఉద్యోగం తప్పనిసరి.

తండ్రి మంచం పట్టాడు. ఒక చెల్లెలు పెళ్లికెదిగి కుంపటి స్థాయికి తర్జుమా అయ్యింది. గుండెలమీదికెళ్ళడానికి సిద్ధంగా వుంది. మరో చెల్లెలు చిన్నది. అయినా కట్నం తీసుకెళ్ళవలసిన ప్రాణే కదా!

అతడి ఇద్దరు తమ్ముళ్ళూ చదువుకుంటున్నారు. ఇంత దగ్గరలో ఏ ఒక్కరూ అందిరాగల అవకాశాలూ లేవు. అలాంటి పరిస్థితిలో విష్ణుమూర్తికొక సిఫారసుదారుడు తగిలాడు. అతడు గోపాలపురం పంచాయితీ ప్రెసిడెంట్.

అతడు విష్ణుమూర్తికి తగలడం కూడా విచిత్ర పరిస్థితుల్లో తటస్థించింది. విష్ణుమూర్తి తండ్రి ఐశ్వర్యంతో తులతూగే రోజుల్లో వాళ్ల ఇంటికెదురుగా ఒక వేశ్యాకుటుంబం వుండేది. వాళ్లది వేశ్యాకుటుంబం అయినా సరే మిగతా సంసార కుటుంబాలతో ఇచ్చిపుచ్చుకోవడాలూ, కష్టసుఖాలు మాట్లాడుకోవడాలూ మామూలుగానే వుండేవి. ఆ ఇంటి పెద్ద వేశ్య పేరు వరలక్ష్మి. ఆమె వద్దకే వచ్చేవాడు గోపాలపురం పంచాయితీ ప్రెసిడెంట్. సదరు వరలక్ష్మికి విష్ణుమూర్తి ఇంటి పరిస్థితులు తెలిశాయి. ఆమె కబురు పంపి విష్ణుమూర్తిని తన దగ్గరకి రప్పించుకుంది.

గోపాలపురం ప్రెసిడెంటు అతడ్ని జిల్లా పరిషత్ అధ్యక్షుడికి



## అమ్మగా జీవించేస్తున్న టాబూ

**అ**వునండీ అవును! టాబూ ఓ హిందీ చిత్రం కోసం జుట్టుకు తెల్లరంగు వేసుకుని అమ్మలా నటించేస్తోంది. కొడుకులెవరనుకున్నారు? అర్బాజ్‌ఖాన్, జుగల్ హన్స్‌రాజ్‌లట. (ఆహా!) మరాఠీలో హిట్ అయిన 'ఆయీ' ఆధారంగా దీన్ని నిర్మిస్తున్నారు. అమ్మగా నటనని టాబూ హ్యాపీగా చేయడం చూసి దర్శకుడు మహేష్ మంజ్రేకర్ ఆశ్చర్యపోతున్నాడట.


అయినా టాబూ! నిన్ను ప్రేక్షకులు అమ్మగా వూహించుకోగలరా? ఏమో డౌటే!

-ప్రియ

పరిచయం చేసి 'ఇక తిరగరా నా కొడకా!' అని కాబోలు దీవించాడు.

అంతే! విష్ణుమూర్తి పని ఇటు వరలక్ష్మి ఇంటికి అటు జిల్లా పరిషత్ అధ్యక్షుడి వూరికీ తిరగడంగానే సరిపోయింది.

ఉద్యోగాల్లేవు. త్వరలో భర్తీ చేయాలి. అందుకు సమయం పడుతుంది. 'గాభరా పడకు' అన్నాడు జిల్లా పరిషత్ అధ్యక్షుడు.




దానాదీనా అతడి ట్యూషన్స్ దెబ్బతిన్నాయి. ప్రయాణం ఖర్చులు పెరిగాయి.

ఈ క్రమంలో వరలక్ష్మి పెంపుడు కూతురు రాఘవ అతడి కష్టాల గురించి అతడితోనే చర్చకు పెట్టింది.

విష్ణుమూర్తి కంటే రెండేళ్ళు చిన్నది రాఘవ!

పెంపుడు తల్లి ఆమెను వృత్తిలోకి దింపింది. అందువల్ల రాఘవ పిన్న వయసులోనే ముదురు మాటలు నేర్చింది.

''మంచివాడ్నే నమ్ముకున్నావు విష్ణూ! అరచేతికి తేనెముక్క రాసి చెయ్యంతా నాకించెయ్యగలడు!'' అంది రాఘవ.

ఆమె మాటలో విసురుంది. పిల్లతనపు పొగరుంది. అర్ధాంతరంగా నేర్చుకున్న జాణతనముంది. అదిగో ఆ విసురూ, పొగరూ, జాణతనమే విష్ణును వణికించి తలెత్తి ఆమెను తేరిపార చూసేలాగ చేశాయి.

అతడు చూపును మరల్చుకోలేకపోయాడు.

చీర కట్టింది రాఘవ. సన్నపాటి మనిషి. సన్నటి పొట్ట. బొడ్డు కిందికి కట్టిన చీర కట్టు. పమిట వక్షస్థలం మధ్యగా సన్నబడిపోయి భుజం వెనక్కి మాయమయ్యింది. అసలే లోనెక్ బ్లవుజ్. పల్చటి ట్రాన్స్‌పెరెంట్. లోపల బ్రాసియర్ లేదు.

యవ్వనం తొలిదశలో ఉన్నదేమో మెరిసిపోతోంది రాఘవ. విష్ణు కలవరపడ్డాడు. రాఘవ నగ్నంగా నిలబడున్నా అంతటి కలవరానికి గురైవుండేవాడు కాదు విష్ణు. అతడి అవస్థ తను గుర్తించినట్లు ఒక చిరునవ్వు విసిరి, క్రింది పెదవిని పంటితో గాటు పెట్టుకుంది రాఘవ.

అతడి నరాలు పురిపెట్టి మెలిక తిప్పిందా పంటిగాటు.

పంటిగాటు పెట్టడంతో వదిలిపెట్టకుండా, విష్ణుమూర్తి చెయ్యి పట్టుకుని తన గుండెలమీద పెట్టుకుంది రాఘవ.

గుండె ఝల్లుమనడం అతడి వంతయ్యింది. బలమైన విద్యుత్ కెరటం తాకినట్టు గిజగిజలాడిపోయాడు విష్ణుమూర్తి. తన అవస్థను ఆమె వ్యంగ్యంగా తీసుకుంటుందనీ, తమ యిద్దరినీ ఎవరైనా గమనిస్తారేమోననీ అతడికారాటంగా వుంది. ఆమెనొదిలిపెట్టి బైటికి వేగంగా వెళ్ళిపోయాడు.

చివరికి విష్ణుమూర్తికా ప్రయత్నం నెరవేరింది కాదు. ప్రెసిడెంట్ ఇంకా ఆ యింటికొస్తోన్నాడు కానీ- విష్ణుమూర్తి మాత్రం తన ఉద్యోగ ప్రయత్నం రూటు మార్చాడు.

అటు తర్వాత రాఘునను కల్సుకోవాలని ప్రయత్నించేవాడే కానీ ఆత్మవిమర్శ



డా.కంభంపాటి స్వయం ప్రకాష్
ఎం.డి.(ఆయుర్వేద)

సెక్సాలజిస్ట్ & ఇన్‌ఫర్టిలిటీ స్పెషలిస్ట్
(అమెరికాలో ప్రొ.జాన్‌మనీ వద్ద శిక్షణ పొందారు)

ప్రతి బుధవారం

కేరాఫ్ కల్పాఫార్మా,,41-3-23,కృష్ణలంక,
బియ్యం కొట్ల బజార్ సెంటర్ వద్ద,విజయవాడ,
ఫోన్:521761 (ఉదయం 9 నుంచి రాత్రి 9గంటల వరకు)

హైదరాబాద్ క్లినిక్ + ఉత్తరాలు రాయాల్సిన చిరునామా:-
118-అమృతవిల్లే, యశోదాహాస్పటల్‌ఎదురుగా, రాజ్‌భవన్ రోడ్,
సోమాజీగూడ,హైదరాబాద్-82 (గురు, శుక్ర,శని, ఆది,సోమ, మంగళ వారాలు)
ఫోన్: 3322884,3328854 సెల్:98490-29947
E-Mail: swayamk @ hd2.vsnl.net.in aducation@hotmail.com

Aడ్యుకేషన్ పుస్తకం వెల రూ.75/- మగవారిలో సంతానలేమి పుస్తకం వెల రూ.27/-
విడుదలయ్యాయి. కావలసినవారు పై అడ్రసుకి M.O.చెయ్యండి.

డాక్టర్ గారి శీర్షికలు వార్త దిన పత్రిక ఆదివారం అనుబంధంలో 'నవీన కామసూత్ర', చిత్రం సినీ వార పత్రికలో 'సృష్టి, నరాగాలులో 'దాంపత్య జీవనం'గా వస్తున్నాయి. పాఠకులూ,సలహాలు కావలసినవారు చదువగలరు.

హార్మోన్ పరీక్ష, రిజిస్కాన్ పరీక్ష లభించును.



అడ్డొచ్చేది. రాఘవ తన గుండెలమీద అతడి చేతిని పెట్టుకొనకుండా వుండి వుంటే బాగుండేది. అతడిలో ఆ చేష్టే అపరాధ భావనను పెంచింది. అదే సమయానికి విష్ణుమూర్తిలో తొలి యవ్వన వాంఛ కూడా ప్రారంభమయ్యింది.

అది కూడా రాఘవ స్పర్శతోనే.

ఆ వూరి నించి దూరంగా వెళ్తేనేకానీ అతడికి ఉద్యోగం లభించింది కాదు. అటు తర్వాత పదిహేడేళ్ళు గడిచిపోయాయి తప్పితే రాఘవను కలుసుకున్న సన్నివేశం తటస్థపడలేదు. తిరిగి ఇప్పుడే ఆమెను కల్సుకోవాలని ప్రయత్నించడం.

రాఘవ అసలుందా! అక్కడే వుందా! లేక ఎవరితోనైనా ఏదైనా వూరు వలస వెళ్లిపోయిందా! అసలు బతికేవుందా!

విష్ణుమూర్తి తన భార్యవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

ఆమెకు గుండె ఝుల్లుమంది.

విష్ణుమూర్తి ఎంత తేలికగా తన సందేహం వ్యక్తపర్చాడో అంత తేలికగానూ ఆమె తీసుకోలేకపోయింది. చిన్ననాటి పరిచయస్తురాలు ఎదురైతే ఎలా వుంటుందో-

బస్‌స్టాండ్ నించి రిక్షామీద సెంటర్ చేరుకొన్నారు. ఒకప్పటి రాజాస్థానం కావడం వల్ల పెద్దాపురంలో సిల్కు పరిశ్రమ వృద్ధిచెందడం మాటెలా వున్నప్పటికీ వేశ్యావాటిక బాగా అభివృద్ధి చెందింది.

''అయ్యబాబోయ్ ఇవన్నీ వృత్తి చేసుకునే ఇళ్లే!'' నోరావులించింది రమ్య.

సెంటర్ దాటి పది గజాల తర్వాత ఎడమ ప్రక్కకి తిరిగిన రిక్షా మూడో యింటి ముందాగింది.

పెంకుటిల్లు. ఎత్తుగోడలు, కడప రాతిపలకలూ, డ్రైనేజి మీద కట్టిన చిన్నవంతెన ఆ యింట్లోకి దారితీస్తోంది.

వంతెన దాటి గుమ్మంలో నిలబడిపోయాడు విష్ణుమూర్తి. ప్రక్కనే రమ్య. రావడమంటే హుషారుగా రాఘవ అంతకుముందుండే యింటికొచ్చాడు కానీ, దరిమిలా మారిన పరిస్థితులెలా వుంటాయో తెలియదు. తమని ఎవరు ఆహ్వానిస్తారో తెలియదు. అసలా యింట్లో రాఘవకి సంబంధించిన వారు ఎవరైనా వున్నారో లేదో కూడా తెలియదు.

తొందరపడి యిక్కడకొచ్చి పొరపాటు చేశాడా! అనవసరంగా రమ్యను కూడా తీసుకొచ్చాడే. పైగా ఇలాంటి ఇళ్లకి ఎవరూ కుటుంబాలతో రారు. వచ్చినప్పటికీ వెంట వచ్చిన ఆడదాని గురించి తప్పుగా అంచనా వేసుకుంటారు.

ఆత్మన్యూనతాభావం అతడ్ని దహించేస్తోంది.

తలుపు తెరిచే వున్నప్పటికీ ఎదరగది ఖాళీగా వుంది.

గొంతు సవరించుకుని ''రాఘవా!'' అన్నాడు.

అతడి గొంతు అతడికే వికృతంగా జీరపోతోంది.

ఇంట్లో అలికిడయ్యింది. ప్రక్క గదిలోంచి ఒక ఆడ శాల్తీ ప్రత్యక్షమయింది. నలభై ప్రాంతంలో వుంటుందామె వయసు. పొట్టిగా వుంది. కొద్దిపాటి కండపట్టిన ఒళ్లు. చామనచాయలో వుంది.

కళ్లు, ఒళ్లు, బట్ట విచిత్రంగా అలంకరించుకుంది. కళ్లలో సంతోషం. ఒక రకంగా ఆహ్వానం.

''ఎవరండీ! లోపలకి రండి!'' అంది గుమ్మం వరకూ వస్తూ.

విష్ణుమూర్తి ఆమెనే పరీక్షగా చూసి, ''రాఘవా!'' అన్నాడు.

ఆమె మొహంలో విపరీతమైన ఆశ్చర్యం!

''మీరు... ఆ! ధనమ్మ మామ్మగారి మనవడు కదూ!'' అన్నదామె.

అంటూనే బైటికొచ్చి రమ్య చెయ్యి పట్టుకుని లోపలికి నడిపించుకు వెళ్లింది.

''ఎంత సంతోషం విష్ణూ! నిన్ను మరల చూస్తాననుకోలేదు'' అంది రాఘవ.

''మా ఆవిడ రమ్య!''

అప్పటికే రాఘవ వాళ్లిద్దర్నీ కూర్చోబెట్టి నవ్వుతూ ఫ్రిజ్ తెరిచి చల్లటి నీరు సర్వ్ చేసింది. పరిచయ వాక్యం ముగియకుండానే రమ్యవైపు నవ్వుతూ చూసి ఆమె భుజం తట్టింది.

''చాలా కాలానికి ఇక్కడో స్నేహితురాలుందని గుర్తొచ్చిందా విష్ణూ!'' అంది రాఘవ, వాళ్లకెదురుగా కూర్చుంటూ.

నవ్వాడు విష్ణుమూర్తి.

''ఏం చేస్తున్నావు! పిల్లలెంతమంది? అన్నట్టు కథలు రాస్తుంటావా ఏం? కె. విష్ణుమూర్తి అనే పేర కొన్ని కథలు చదివాను'' అంది రాఘవ.

విష్ణుమూర్తి సమాధానాలు చెబుతున్నాడు.

రాఘవ తనకలాంటి బాల్య స్నేహితుడున్నందుకు పొంగిపోతోంది.

ఆ సంగతి కనిపెట్టాడు విష్ణు.

''ఎంతసేపమ్మాయీ కబుర్లు?'' అంటూ ముసలావిడ వచ్చింది.


ఆమె రాఘవను పెంచుకున్న తల్లిగా గుర్తుపట్టాడు

## మారిన పేరు

గ్లామర్‌గాళ్ కరీనాకపూర్ అసలు పేరు సిద్ధిమా. కపూర్స్ కుటుంబంలోని ఈ అందాల తారకి నామకరణం చేసింది తాతగారయిన రాజ్‌కపూర్. గణపతి నవరాత్రుల్లో జన్మించినందువల్ల ఈ పేరు పెట్టారట.

ఈ పేరు సిద్ధిమా కపూర్ నచ్చకపోవడం వల్ల కరీనా కపూర్‌గా పేరు మార్చుకుంది. పెద్దవాళ్లు వాళ్ల సెంటిమెంట్‌గా ఏదో పేరు పెడతారు. ఆ పేరుతోనే జీవితాంతం కొనసాగాలన్న రూలేముందీ-అంటోంది సిద్ధిమా కపూర్ సారీ, కరీనా కపూర్.

-శ్వేత



విష్ణు.


ఇక కబుర్లే కబుర్లు! విశేషాలే విశేషాలు! మర్యాదలే మర్యాదలు!

''మేం హోటల్లో వుంటాం. నీకెప్పుడు తీరుబాటుంటుంది?'' అడిగాడు విష్ణు.

ఆమె కోపంగా చూసింది.

''ఈ యిల్లు నీ యిల్లు కాదా?'' అంది చివరకి.

''అలా అని కాదు. ఎవరెవరో వస్తారు వెళ్తారు నీకోసం! డిస్టర్బెన్స్‌గా వుంటుంది నీ రోజువారీ వ్యవహారానికని!''




అర్థం చేసుకుని అంత కోపాన్నీ నవ్వులోకి తర్జుమా చేసింది రాఘవ.

''వృత్తిమాని చాలా కాలమయింది!'' అంది నెమ్మదిగా.

''మానేశావా, ఏం?''

తిరిగి ఆమె నవ్వింది. ఆ నవ్వులో పెద్ద తరహా బోళాతనముంది.

''పనికి రాను. రిటైరైపోయాను''

''ఎందువల్ల?''

రమ్య అతడ్ని విచిత్రంగా చూస్తోంది.

ఆమె వృత్తిమీద భర్తకెందుకాసక్తి? అది ఏమంత తెల్సుకోవలసిన విషయమా? భర్త యింకా చిత్రవిచిత్రమైన ప్రశ్నలు అడుగుతూనే వున్నాడు. ఆమె నిర్మొహమాటంగా నిస్సిగ్గుగా చెబుతూనే వుంది.

ఆ రాత్రికక్కడే ఆగిపోయారు.

''పోషణ ఎలా?'' అడిగాడు విష్ణుమూర్తి.

రాఘవ నవ్వి ''జాగ్రత్త పడ్డాను'' అంది.

''ఎవరి చేతనైనా వృత్తి చెయ్యిస్తున్నావా?''

ఆమె నవ్వి వూరుకుంది.

రమ్యకి మాత్రం ఆ నవ్వు ఒళ్లు జలదరింపజేసింది.

ఆ రాత్రి భార్యాభర్తలిద్దరికీ రాఘవ చాలా మర్యాదలు చేసింది. తలంట్లు, తలకి సాంబ్రాణి ధూపాలు, మంచి కూరలూ, గడ్డపెరుగూ, రకరకాల పచ్చళ్లతో భోజనానంతరం రుచికరమైన కిళ్ళీలూ, రాత్రికి మెత్తటి బెడ్సూ చుట్టూ దోమతెరలూ- మురిసిపోయింది రమ్య. అంతకుముందు రాఘవలాంటి స్త్రీతో పరిచయమైనందుకు చింతించవలసొస్తుందనిపించింది. ఆమె వుంటున్న యింట్లో ఒక రాత్రంతా గడపడం అవమానకర అనుభవంగా మిగుల్తుందేమో అనిపించింది.

అతిథి మర్యాదల్లో రాఘవకి సాటి లేరు. అసలు అతిథి మర్యాదలు ఇన్నిరకాలా ఇంత వైభవంగా చేయొచ్చునని మొదటిసారిగా రమ్యకి తెలిసొచ్చింది.


ఆమెకెప్పుడు కునుకు పట్టిందో తెలియదు.

ఒకరాత్రి వేళ మెలకువ వచ్చి చూస్తే భర్త అవతల దోమతెరలో లేడని అర్థమయ్యింది. పెద్ద హాలులో పదిహేను కాండిల్ బల్బ్ వెలుగుతో ఆ కాంతి గదిలోకి ప్రతిఫలిస్తోంది.

రమ్యకి నెత్తిమీద ఎవరో మొత్తినట్టయ్యింది.

సానికొంప యిదనే సంగతి మర్చిపోయి ఎంత సుఖంగా నిద్రపోయింది తాను. అసలే తన భర్తా, రాఘవా చిన్నప్పటి ఫ్రెండ్స్. తనకి తెలియని, వాళ్లు చెప్పని జీవితం వాళ్లిద్దరి మధ్య ఎంతుందో!

అది రహస్య జీవితం అని గాఢంగా నమ్మింది రమ్య. అదే నమ్మకంతో రమ్యకి ఒళ్లంతా కంపరం పుట్టుకొచ్చింది. దోమతెర ఒక పట్టాన తప్పుకుంది కాదు.




గదిలోంచి బైటపడి హాలంతా వెతుక్కుంది రమ్య.

పెరట్లోంచి కబుర్లు చెప్పుకుంటున్న సవ్వడి లీలగా ఆమె చెవులకు తోచింది. పెరట్లోకి పరుగెత్తింది రమ్య.

పెరట్లో పాలకాంతి బల్బు వెలుగుతోంది. సన్నజాజి పందిరీ, దానికవతల నుయ్యీ, నూతిచుట్టూ- పళ్లెం, పళ్లెం మీద రెండు కుర్చీలూ కుర్చీల్లో వాళ్లిద్దరూ-

రమ్య నీడ పొడవుగా సాగి వాళ్ల మధ్యన పడింది.

వాళ్లిద్దరూ తలలు తిప్పి రమ్యను చూశారు. రాఘవ నెమ్మదిగా తన కుర్చీలోంచి లేచి నూతి అంచుమీద కూర్చుంది.

''కూర్చో రమ్యా!'' అంటూ కుర్చీ చూపించింది రాఘవ.

సందేహంగా కూర్చుంది రమ్య.

''ఫరవాలేదు కూర్చో! నేను అంత త్వరగా చచ్చిపోను. నాకింకా ఆయుష్షు వుంది సుమా!'' అంది.

రమ్య నొచ్చుకున్నట్టు చూసింది.

రాఘవ నవ్వి ముందుకు వంగి

''గాభరాపడ్డావ్ కదూ రమ్యా! మీ ఆయన శీలం శంకించావు కదా! ఒక వేశ్యగా నా అనుభవాలు అడుగుతున్నాడయ్యె! చెప్పకుండా ఎలా వుండగలను'' అంది.

ఇబ్బందిగా కదిలి తేరుకుని ఫక్కున నవ్వేశాడు విష్ణుమూర్తి.

★ ★ ★

''రాత్రి రాఘవ చాలా విషయాలు చెప్పింది''

బస్సు హోరులో విష్ణుమూర్తి మాటలు ఎగిరిపోతున్నాయి. హైవేమీద బస్సు వేగంగా పోతూ అన్నవరం దాటింది.

''రాఘవ రాత్రి నూతి పళ్లెం మీద కూర్చున్నప్పుడు నీకేం తోచింది?''

రమ్య అతడి వైపు తేరిపార చూస్తోంది!

''చచ్చిపోతుందని కదూ! నిజమే అన్ని అనుభవాలు చెప్పాక- అసలు ఒక ఆడదానికి అంత నికృష్టమైన అనుభవాలు ఎదురయ్యాక ఇక ఆడది బతికి వుండలేదు. ఆమె అనుభవాలతో నాకో మంచి కథ తయారవుతుంది. అయితే-'' ఆగాడు విష్ణుమూర్తి.

ఏమిటన్నట్టు చూసింది రమ్య.

''తన వికృతానుభవాలు చెప్పి యిక బాల్య స్నేహితుడైన నా మొహం చూడలేక ఆమె వెనక్కి ఒరిగి నూతిలో పడిపోయిందనుకో- పాత్రమీద పాఠకులకు ఎంత సానుభూతి కలుగుతుందో-''

రమ్యకి ఒళ్లంతటా కారం రాసుకున్నట్టయ్యింది.

రాఘవ కేవలం ఒళ్లే పాడుచేసుకుంది. తన భర్త మాత్రం రచయిత ముసుగులో మెదడంతా కుళ్లబెట్టుకున్నాడు. పాత్రలతో ఆయన ఆడుకునే తీరు వికృతంగా తోచింది.

రాఘవ మీద ఆమెకి తొలిసారి ప్రేమ పుట్టుకొచ్చింది. తన ప్రేమ మాత్రం సానుభూతితో పుట్టిన ప్రేమ అని ఆమెకు తెలుసు. ☆